

చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



దాడి సిగ్గుసిగ్గు


ఏలూరులో సాక్షి కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని దాడిని జర్నలిస్టులు ఖండించారు.

4లో



జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

పది.. ఫలితాల్లో పల్టీ!



- గతేడాది కంటే 10.86 శాతం తగ్గిన ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 23వ స్థానంలో నిలిచిన జిల్లా
- బాలికలు 74.80 శాతం, బాలురు 65.56 శాతం ఉత్తీర్ణత
- కార్పొరేట్‌తో పోటీపడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా



అనంతపురం ఎడ్యుకేషన్‌: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా పల్టీ కొట్టింది. గతేడాదికంటే ఏకంగా 10.86 శాతం ఉత్తీర్ణత తగ్గడం ఆందోళన కల్గిస్తోంది. గతేడాది 30,893 మంది విద్యార్థులకు గాను 25,003 మంది (80.93 శాతం) ఉత్తీర్ణత సాధించగా... ఈసారి 30,700 మంది విద్యార్థులకు గాను 21,510 మంది (70.07 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అయితే రాష్ట్రంలో గతేడాది కంటే ఒక స్థానం పైకి ఎగ బాకడమే కాస్త ఊరటనిచ్చే అంశం. గతేడాది 24వ స్థానంతో సరిపెట్టుకున్న జిల్లా ఈసారి 23వ స్థానంలో నిలిచింది.

బాలికలదే పైచేయి

బుధవారం ఉదయం 10 గంటలకు ఫలితాలు విడుదలయ్యాయి. ఉత్తీర్ణత విషయంలో బాలికలే పైచేయి సాధించారు. మొత్తం 14,967 మంది బాలికలకు గాను 11,195 మంది (74.80) శాతం ఉత్తీర్ణులవ్వగా, 15,733 మంది బాలురకుగాను 10,135 మంది(65.56 శాతం) పాసయ్యారు. మొత్తంగా 16,443 మంది ప్రథమశ్రేణి, 3,299 మంది ద్వితీయ, 1,768 మంది తృతీయశ్రేణి సాధించారు.

కార్పొరేట్‌కు తీసిపోని ప్రభుత్వ విద్యార్థులు

మార్కులు సాధించడంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పడ్డారు. జిల్లా కేంద్రంలోని మినర్వా పాఠశాల విద్యార్థిని బి.రెనీలా ప్రియ, శ్రీచైతన్య అనంతపురం, గుంతకల్లు బ్రాంచ్‌ల విద్యార్థులు వి.రోహిత్‌సాయి, కె.వికాస్‌రెడ్డి, ఎస్.లక్ష్మీచాతుర్య, టీఆర్ దీక్షిత్ 596 మార్కులు, ఉరవకొండ వివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థి షీజ 594 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలవగా.. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి గుత్తి మోడల్ స్కూల్ విద్యార్థి గాజంశెట్టి నరసింహ 593 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు.

మే 19 నుంచి సప్లిమెంటరీ

సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరుగుతాయి. ఈనెల 24 నుంచి 30 లోపు ఫీజు చెల్లించాలి. రూ. 50 అపరాధ రుసుంతో మే 1 నుంచి 18 వరకు చెల్లించవచ్చని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ. 125, మూడుకంటే తక్కువ సబ్జెక్టులకు రూ. 110, మైగ్రేషన్ రుసుం రూ. 80 చెల్లించాలి. రీ కౌంటింగ్ కోరే విద్యార్థులు రూ. 500, రీ వెరిఫికేషన్, జవాబు పత్రాల జిరాక్స్ ప్రతులకైతే సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి ఈనెల 24 నుంచి మే 1లోపు సంబంధిత హెచ్‌ఎంల లాగిన్లలో దరఖాస్తు చేయాలని డీఈఓ స్పష్టం చేశారు. నేరుగా డీఈఓ కార్యాలయానికి గాని, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వారికి పోస్ట్‌ద్వారా కాని, వ్యక్తిగతంగా కాని అందజేసినా స్వీకరించబోమని స్పష్టం చేశారు.

యాజమాన్యాల వారీగా ఇలా...

యాజమాన్యం	పరీక్ష రాసిన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం
ఎయిడెడ్	406	309	76.11
బీసీ వెల్ఫేర్	365	314	86.03
ప్రభుత్వ స్కూళ్లు	1,817	917	50.47
కేజీబీవీ	1,218	884	72.58
మున్సిపల్	2,083	1,145	54.97
మోడల్ స్కూళ్లు	1,261	923	73.20
ప్రైవేట్ స్కూళ్లు	11,807	10,856	91.95
మైనార్టీ వెల్ఫేర్	234	213	91.03
ఏపీ ఎస్‌డబ్ల్యూ	657	562	85.54
ఏపీ టీడబ్ల్యూ	199	126	63.32
జిల్లా పరిషత్	10,653	5,261	49.39
మొత్తం	30,700	21,510	70.07

గత ఫలితాలను పరిశీలిస్తే...

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం	రాష్ట్రంలో జిల్లా స్థానం
2022	49.70	చివరిస్థానం
2023	66.25	20
2024	80.93	24
2025	70.07	23



593 మార్కులు సాధించిన గాజంశెట్టి నరసింహను సన్మానిస్తున్న గుత్తి ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

'ఓపెన్' ఫలితాల్లోనూ తుస్!

అనంతపురం ఎడ్యుకేషన్‌: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లోనూ జిల్లా తుస్ మనింది. పదో తరగతిలో కేవలం 5 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, ఇంటర్‌లో 22 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది పదో తరగతి, ఇంటర్ రెండింటిలోనూ 65 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచిన జిల్లా.. ఈ సారి చతికిలపడింది. పదో తరగతి ఫలితాల్లో 23వ స్థానంలో నిలవగా, ఇంటర్ ఫలితాల్లో 22వ స్థానానికి పరిమితమైంది. ఆరోపణల నేపథ్యంలో ఈసారి పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని విద్యాశాఖలో చర్చ జరుగుతోంది.








బి.రెనీలా ప్రియ (596) | వి.రోహిత్‌సాయి (596) | కె.వికాస్‌రెడ్డి (596) | ఎస్.లక్ష్మీచాతుర్య (596) | టీఆర్ దీక్షిత్ (596) | షీజ (594)

నేడు సత్యసాయి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: ప్రపంచ మానవాళికి ఆధ్యాత్మిక, మానవతా విలువలను బోధిస్తూ సన్మార్గం వైపు నడిపిన మహనీయుడు సత్యసాయి ఆరాధనోత్సవాలు గురువారం జరగనున్నాయి. ఇందు కోసం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సర్వం సిద్ధం చేశారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేక ఫల,పుష్ప దళాలతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. తమ ఇష్ట దైవం సత్యసాయికి ఆత్మనివేదన అర్పించుకోవడానికి దేశ విదేశాల నుంచి భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు.

వేడుకలు ఇలా...

సత్యసాయి ఆరాధనోత్సవాలు సాయి కుల్వంత్ సభా మందిరంలో గురువారం ఉదయం 8 గంటలకు సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో ప్రారంభం కానున్నాయి. ఉదయం 8.10 గంటలకు సత్యసాయి విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ పంచరత్నకీర్తనలు ఆలపిస్తారు. 9.05 గంటలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద ప్రారంభోపన్యాసం చేస్తారు. 9.15 గంటలకు సత్యసాయి శతజయంతి వేడుకల బ్రోచర్ విడుదల చేస్తారు. 9.30కు సత్యసాయి సేవా సంస్థల దేశీయ అధ్యక్షుడు నిమిష్ పాండే వేడుకలనుద్దేశించి ప్రసంగిస్తారు. 9.40కు శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని కార్యక్రమం ప్రారంభోత్సవం నిర్వహిస్తారు. 9.50కి సత్యసాయి పూర్వపు దివ్య ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తారు. 10.10 గంటలకు భజనలు,అనంతరం మంగళ హారతితో వేడుకలు ముగుస్తాయి.

అమానుషం.. అనాగరికం

- కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

అనంతపురం కార్పొరేషన్‌: అమాయకుల ప్రాణాలు బలిగొనడం అమానుషం, అనాగరికమని వైఎస్సార్ సీపీ శ్రేణులు పేర్కొన్నాయి. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ బుధవారం అనంతపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. జెడ్పీ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ అమరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించిన అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి జరిగిందన్నారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేసి ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదన్నారు. విహార యాత్రకు వెళ్లిన అమాయకులు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం మేలుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు,అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, మల్లెమీద నరసింహులు, అమర్‌నాథరెడ్డి, చంద్రశేఖరయాదవ్, చింతా సోమశేఖర రెడ్డి, గాజుల ఉమాపతి, ఓబిరెడ్డి, నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, వెన్నం శివరామిరెడ్డి, కేశవరెడ్డి, పెన్నోబులేసు, వేముల నదీం, మారుతీ నాయుడు, గౌని నాగన్న, మల్లెల వేణు, సతీష్,కృష్ణవేణి, దేవి, కాకర్ల శ్రీనివాసరెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, సాకే చంద్రలేఖ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




వైఎస్సార్ సీపీ శ్రేణులు వెలిగించిన కొవ్వొత్తులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఉగ్రదాడి పిరికిపంద చర్య

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'



అనంతపురం కార్పొరేషన్‌: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అమాయకుల మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులకు తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ దాడి యావత్ దేశాన్ని కలచి వేసిందని, బాధ్యులు తప్పకుండా భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఇటువంటి సమయంలో అందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుద్దామన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా కేంద్రం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

డిటోనేటర్ పేలి మహిళకు తీవ్ర గాయాలు



పేలుడులో ఛిద్రమైన చెయ్యి

పెద్దవడుగూరు: మండలంలోని అప్పేచెర్ల గ్రామంలో డిటోనేటర్ పేలి వ్యవసాయ మహిళా కూలీ సుంకమ్మ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. అప్పేచెర్లకు చెందిన రైతు చౌడప్ప పొలంలోని పత్తి కట్టెను తొలగించేందుకు బుధవారం మహిళా కూలీలు వెళ్లారు. అప్పటికే అడవి పందుల కోసమని గుర్తు తెలియని వ్యక్తులు కాయలాంటి పదార్థంలో డిటోనేటర్లు పెట్టి ఉంచారు. ఈ విషయం తెలియని మహిళా కూలీ సుంకమ్మ ఆసక్తిగా దానిని తీసుకుని పరిశీలించి, కాయను పగులగొట్టి తినే ప్రయత్నంలో భాగంగా రాయిపై పెట్టి మరో రాతితో బలంగా కొట్టింది. దీంతో ఒక్కసారిగా పేలుడు సంభవించి ఆమె ఎడమ చెయ్యి పూర్తిగా ఛిద్రమైంది. క్షతగాత్రురాలిని వెంటనే గుత్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్‌: త్వరలో జరిగే బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీతో పాటు ప్రత్యేక పాయింట్ల కోసం మెడికల్ సర్టిఫికెట్ల ఆధారంగా దరఖాస్తు చేసే టీచర్లు గురువారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా సర్వజన ఆస్పత్రిలో జరిగే వైద్య సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తమవద్ద ఉన్న సర్టిఫికెట్లను పరిశీలించి వైద్యబృందం కొత్తగా మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేస్తుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు రూ. వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తొలిరోజు అనంతపురం జిల్లా పరిధిలోని టీచర్లు, రెండోరోజు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని టీచర్లు హాజరుకావాలన్నారు. ఈ రెండు రోజుల్లో గైర్హాజరైన వారికి చివరి రోజు అవకాశం ఉంటుందన్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రక్రియ సాగుతుందని డీఈఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

అధికారులపై కక్ష సాధింపు తగదు

• ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



ఉరవకొండ: కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, అవినీతి అక్రమాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం చంద్రబాబు తనకు అలవాటైన డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తున్నారని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మండిపడ్డారు. పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్‌పై బుధవారం ఆయన స్పందించి, ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో ఇంటలిజెన్స్ చీఫ్‌గా పీఎస్ఆర్ ఆంజనేయులు ఎంతో నిజాయితీతో పనిచేశారన్నారు. అలాంటి వ్యక్తిపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గు చేటన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదని చంద్రబాబు గుర్తించాలన్నారు. రాజధాని కాంట్రాక్టు సంస్థల నుంచి భారీగా ముడుపుల స్వీకరించి, హామీలను అమలు చేయకపోవడం, రూ. కోట్ల విలువైన భూములను కారుచౌకగా సూట్‌కేస్ కంపెనీలకు ధారాదత్తం చేయడం వంటి చర్యలపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసహనాన్ని డైవర్ట్ చేసేందుకు ఇంతటి దిగజారుడు రాజకీయాలకు చంద్రబాబు తెరతీశారని మండిపడ్డారు.

నేటి నుంచి ఇంటర్ అధ్యాపకులకు శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ విద్యా మండలి ఈ విద్యా సంవత్సరం (2025–26) నుంచి ప్రథమ సంవత్సరం కోర్సుల్లో కొత్త సిలబస్‌ను ప్రవేశ పెట్టడం, ప్రశ్నాపత్రాల విధానంలో చేసిన మార్పులపై అధ్యాపకులకు గురువారం నుంచి జిల్లాస్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో జరిగే శిక్షణకు జిల్లాలోని రెగ్యులర్, కాంట్రాక్ట్, గెస్ట్ అధ్యాపకులు హాజరుకావాలని జిల్లా వృత్తి విద్యాధికారి ఎం.వెంకటరమణ నాయక్ ఆదేశించారు. మొదటి దశ 24, 25 తేదీల్లో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, రెండో దశ 28, 29 తేదీల్లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, మూడో దశ మే 2, 3 తేదీల్లో జువాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్, చివరి నాలుగో దశ 5, 6 తేదీల్లో కామర్స్, సంస్కృతం అధ్యాపకులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఏ ఒక్కరికీ మినహాయింపు ఉండదని అందరూ విధిగా హాజరుకావాలని డీవీఈఓ స్పష్టం చేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: జిల్లాలోని గొల్లలదొడ్డిలో ఉన్న గిరిజన గురుకుల కళాశాలలో 2025–26 ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మే 7వ తేదీ లోపు https:/twreiscet. apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 98853 69079, 89782 39363, 83416 03090లో సంప్రదించవచ్చు.

● సెలవులకు వస్తున్నాం..



వెళ్లొస్తాం : విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడుతున్న అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్

అచ్చంగాయలు.. తొక్కుడు బిళ్లలు.. చిల్లాకట్టె... తాటి ముంజలు.. మామిడి పండ్లు... వీటన్నింటినీ మించి.. బోలెడన్ని సెలవులు!!! జిల్లాలోని పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులందరిలోనూ ఒక్కటే ఉత్సాహం. మది నిండా సెలవులను ఎలా ఎంజాయ్ చేద్దామనే ప్రణాళికలు రూపొందించుకుని తల్లిదండ్రులతో కలసి స్వగ్రామాలకు ప్రయాణమయ్యారు. దీంతో బుధవారం అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండు విద్యార్థులతో కళకళలాడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మళ్లీ వస్తాం: ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న విద్యార్థిని









పెట్టెబేడాతో : లగేజీలు తీసుకుని పిల్లలతో కలసి గ్రామాలకు ప్రయాణమైన తల్లిదండ్రులు



ఆటవిడుపునకు సై : క్రికెట్ బ్యాట్‌తో స్వగ్రామానికి ప్రయాణమైన విద్యార్థి

వాల్మీకి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అందజేసే ప్రతిభా పురస్కారాలకు ఈ విద్యా సంవత్సరం పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన వాల్మీకి/బోయ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు ఆర్సీ అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 460.. ఆపై మార్కులు సాధించిన విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతూ 500.. ఆపై మార్కులు సాధించిన వారు అర్హులు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ 400.. ఆపై మార్కులు, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతూ 420.. ఆపై మార్కులు సాధించిన వారు అర్హులు. ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులైతే 850.. ఆపై మార్కులు సాధించిన వారు, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు అయితే 900.. ఆపై మార్కులు సాధించి ఉండాలి. దరఖాస్తులు ఈ నెల 30వ తేదీ లోపు ఆర్సీ అక్కులప్ప, డోర్ నంబరు 28–787, సంగమేష్ నగర్, అనంతపురం చిరునామాకు పంపాలి. పూర్తి వివరాలకు 94407 74519, 83090 90406లో సంప్రదించవచ్చు.

ప్రభుత్వ కార్యాలయం.. ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి కాదు, ఔట్‌సోర్సింగ్ అంతకన్నా కాదు, కాంట్రాక్ట్ ఉద్యోగి కూడా కాదు. కానీ ప్రభుత్వ కార్యాలయంలో దర్జాగా కంప్యూటర్ ముందు కూర్చొని తన పని తాను చేసుకుంటున్నాడు. ఎవరని అడిగితే ప్రైవేట్ డ్రిప్ కంపెనీలో పనిచేస్తున్నాడట! ఏమి చేస్తున్నావంటే? ఏమీ లేదంటూనే... సీరియస్‌గా కంప్యూటర్‌లో వివరాలు నమోదు చేసుకోసాగాడు. బుధవారం ఉదయం సరిగ్గా 10.30 గంటలకు స్థానిక ఏపీ మైక్రో ఇరిగేషన్ ఆఫీసు (ఏపీఎంఐపీ) కార్యాలయంలో ఈ చోద్యం వెలుగు చూసింది. ఉదయం 10.45 గంటల నుంచి 11 గంటల మధ్య పీడీ, ఏపీడీ, సూపరింటెండెంట్, మైక్రో ఇంజనీర్లు, ఎంఐఏఓలు, క్లరికల్ స్టాఫ్ ఒక్కొక్కరూ కార్యాలయానికి వచ్చారు. అప్పటి వరకూ అతను కంప్యూటర్‌ను వదలకుండా అందులోని మొత్తం సమాచారాన్ని నోట్ చేసుకోవడం గమనార్హం. ఇతనొక్కడే కాదు అప్పుడప్పుడు ప్రైవేట్ వ్యక్తులు కొందరు కార్యాలయానికి చేరుకుని అధికారుల సీట్లలో దర్జాగా కూర్చొని వారి కంప్యూటర్లలోని సమాచారాన్ని తెలివిగా అపహరించుకెళుతున్నట్లుగా తెలిసింది.



ఏపీఎంఐపీ కార్యాలయంలో కంప్యూటర్‌లోని సమాచారాన్ని తస్కరిస్తున్న ప్రైవేట్ వ్యక్తి

'ఎన్‌సీడీసీ రుణాల రికవరీ పెరగాలి'

అనంతపురం అగ్రికల్చర్: నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) నుంచి గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల సభ్యులు తీసుకున్న రాయితీ రుణాల రికవరీ పెరిగితే... కొత్తగా రుణ ప్రతిపాదనలు పంపిస్తామని షీప్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న షీప్ యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉమ్మడి జిల్లా మహాజన సభలో ఈ అంశంపై చాలా సేపు చర్చ సాగింది. ఈడీ కేఎల్ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన మహాజనసభలో పర్సన్ ఇన్‌చార్జి హోదాలో డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, అలాగే పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, సహకార అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు. గతంలో ఎన్‌సీడీసీ నుంచి రూ.10 కోట్ల వరకు రుణాలు అందించామని, గడువు మీరినా ఇంకా రూ.2.50 కోట్ల రుణాల వసూళ్లు పెండింగ్‌లో ఉన్నందున కొత్తగా రుణాల మంజూరుకు అవరోధం ఏర్పడుతోందన్నారు. ఇది ఆర్థికంగా పురోగతి సాధించాలనుకున్న గొర్రెలు, మేకల సహకార సంఘాల సభ్యులకు ఇబ్బందిగా మారుతోందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏర్పడిన పాలక వర్గాల సభ్యులను పరిచయం చేసుకుని పనితీరుపై అవగాహన కల్పించారు.

స్వచ్ఛ ఆంధ్ర అమలులో కలెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



అనంతపురం అర్బన్ : స్వచ్ఛ ఆంధ్ర (గ్రామీణ) కార్యక్రమాల అమలులో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. అవార్డులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజ బుధవారం ప్రకటించారు. ఈ నెల 24న విజయవాడలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఓడీఎఫ్ ప్లస్ కింద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిర్వహించి ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాయి. ఇందుకు గాను కలెక్టర్ వినోద్‌కుమార్‌ఉత్తమ అవార్డు అందుకోనున్నారు. ఇక శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ రెండో స్థానంలో నిలిచారు.

'సాక్షి' కార్యాలయంపై దాడి హేయం



అనంతపురంలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

విలేకరులపై దాడులు సరికాదు



ఏలూరులో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరుల దాడిని పత్రికా లోకం తీవ్రంగా ఖండిస్తోంది. ఎమ్మెల్యే దగ్గరుండి ఇలాంటి దాడులు చేయించడం మంచి పద్ధతి కాదు. ఇలాంటి వారిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వెంటనే చర్యలు తీసుకోవాలి. మన జిల్లాలోనూ పత్రికా విలేకరులపై దాడులు చేస్తున్నారు. బూతులు తిడుతూ వీడియోలు విడుదల చేస్తున్నారు. ముఖ్యమైన టీడీపీ నాయకులే ఇలా వ్యవహరిస్తున్నారు. ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కలసి విన్నవించాం. దాడులు ప్రజాస్వామ్యంలో మంచి పరిణామం కాదు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని కోరుకుంటున్నాం.

– రాచమల్లు భోగేశ్వరరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు

• ఎమ్మెల్యే చింతమనేని బహిరంగ క్షమాపణ చెప్పాలి
• అనంతలో గళమెత్తిన కలం యోధులు

అనంతపురం: బెదిరింపులు, అక్రమ కేసుల నమోదుతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని పాత్రికేయులు మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు 'సాక్షి' పత్రికపై కక్షసాధింపు చర్యలకు దిగడం సిగ్గు చేటన్నారు. నిజాన్ని నిర్భయంగా ప్రచురించినందుకు ఏలూరులోని సాక్షి కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అనుచరులు మంగళవారం దాడులకు తెగబడిన విషయం తెలిసిందే. కార్యాలయంలోకి చొరబడి కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ దాడిని నిరసిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు భగ్గుమన్నారు. చింతమనేని తీరుకు నిరసనగా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతపురంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా యావత్ పౌరసమాజం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఇదో బ్లాక్‌డేగా అభివర్ణించారు. కార్యక్రమానికి పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, ఏపీయూడబ్ల్యూజే గౌరవాధ్యక్షుడు రాచమల్లు భోగేశ్వరరెడ్డి, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అనిల్‌కుమార్‌రెడ్డి, సాక్షి దిన పత్రిక బ్యూరో గుండం రామచంద్రారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి తోలేటి మహేశ్వరరెడ్డి, సాక్షి టీవీ కరస్పాండెంట్ శివారెడ్డి, సాక్షి ప్రకటనల విభాగం మేనేజర్ బోరెడ్డి రెడ్డప్పరెడ్డి, మన అనంతపురం మాసపత్రిక ఎడిటర్ తోట నాగరాజు, మీడియా ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, సెక్రెటరీ సుధాకర్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష పూరిత దాడులు చేస్తున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకులు సూపర్ సిక్స్ పథకాల అమలు పక్కన పెట్టి.. 'సాక్షి'పై కక్షపూరితంగా దాడులు చేస్తున్నారు. ఏలూరులో సాక్షి కార్యాలయంపై చింతమనేని, ఆయన అనుచరులు దాడి సిగ్గుచేటు. ఈ అంశాన్ని మేధావులు, ప్రజాప్రతినిధులు అందరూ ఖండించాలి. తక్షణమే చింతమనేని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి. లేదంటే ఆయన కార్యాలయం ముట్టడికి మా విలేకరులు వెనుకాడరు. వ్యతిరేక వార్తలు రాస్తే ఖండన రాయమని కోరవచ్చు. స్వేచ్ఛ గురించి మాట్లాడిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వారి నాయకులను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే వారి ఇళ్లను ముట్టడిస్తాం. ఈ ఉద్యమం ఇంతటితో ఆగదు.

– కె.అనిల్‌కుమార్ రెడ్డి, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

బహిరంగ క్షమాపణ చెప్పాలి



ఏలూరులో సాక్షి కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. చింతమనేని, ఆయన అనుచరులు సాక్షి కార్యాలయంపై చేసిన దాడిని యావత్ రాష్ట్ర ప్రజలు గమనించారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్యగా పరిగణిస్తున్నారు. ఈ రోజు ఈ పత్రికకు జరగొచ్చు. రేపు ఇంకో పత్రికకు జరగొచ్చు. విలేకరులందరూ కలిసికట్టుగా కూటమి ప్రభుత్వ ఆగడాలను ఎండగట్టకపోతే భవిష్యత్తులో ఏ జర్నలిస్టూ పనిచేయలేని పరిస్థితి వస్తుంది. చింతమనేని బహిరంగ క్షమాపణలు చెప్పాలి. పూర్తిగా నేరచరిత్ర కలిగిన చింతమనేనిని చంద్రబాబు ప్రోత్సహించడం మంచిది కాదు. శాంతి స్థాపన అనే పవన్‌కళ్యాణ్ కూడా ఈ విషయంపై స్పందించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పోరాటం ఇంతటితో ఆగదు. శాంతియుతంగానే ఆయన ఇంటిని ముట్టడిస్తాం. 'సాక్షి'లో ప్రచురితమైన కథనం బాధితుడి వాంగ్మూలం మేరకే రాశారనే విషయం చింతమనేని గుర్తుంచుకోవాలి.

– గుండం రామచంద్రారెడ్డి (ఆర్‌సీఆర్), బ్యూరో ఇన్‌చార్జ్, అనంతపురం

'ప్రభుత్వ' ఆణిముత్యాలు వీరే..

అనంతపురం ఎడ్యుకేషన్: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మనబడి నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. వసతుల కల్పన, నాణ్యమైన బోధనకు శ్రీకారం చుట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరిగాయి. ఫలితంగా పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి టాప్ 10లో తమ స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

విద్యార్థి పేరు	మార్కులు	స్కూలు
గాజంశెట్టి నరసింహ	593	ఏపీ మోడల్ స్కూల్, గుత్తి
చౌల గోస్పాజ	592	కేఎస్ఆర్ బాలికల స్కూల్, అనంతపురం
బత్తల హర్షవర్ధన్	592	ఆర్ఎంహెచ్ స్కూల్, అనంతపురం
దబ్బడి రుహాన్ని	592	బాలికల జెడ్పీహెచ్ఎస్, రాయదుర్గం
గరిశలపల్లి తనూశ్రీ	591	శారదా స్కూల్, అనంతపురం
జి.శ్రీరంగదాక్షిణ్య	591	ఏపీ మోడల్ స్కూల్, తాడిపత్రి
ఎం.ఆమీరా పర్వీన్	589	మునిసిపల్ ఉర్దూ స్కూల్, రాయదుర్గం
నాయకుల అక్షయ	587	కేజీబీవీ రాయదుర్గం
కడపల కావ్యశ్రీ	586	ఏపీఆర్ఎస్ రజాపురం, గుత్తి
పరవస్తు వైష్ణవి	586	ఏపీ మోడల్ స్కూల్, గుత్తి
కురుబ అమోఘ	586	శారదా స్కూల్, అనంతపురం
బి.నితిన్‌కుమార్‌రెడ్డి	586	ఏపీఆర్ఎస్ నూతిమడుగు, కంబదూరు
కటిక కిరణ్‌కుమార్	585	ఏపీ మోడల్ స్కూల్, గుత్తి
బోయ ఇందు	585	ఏపీఆర్ఎస్, గుత్తి
పాలిమేర రమ్యశ్రీ	585	ఏపీ మోడల్ స్కూల్, తాడిపత్రి
సుంచు యుగంధర్	584	ఏపీ మోడల్ స్కూల్, ఉరవకొండ
కావలి జ్యోతి	584	జెడ్పీహెచ్ఎస్ కసాపురం, గుంతకల్లు
మిడతల జ్యోత్స్న	584	ఏపీఆర్ఎస్, గుత్తి
తరిమెల రిజ్వానా	584	ప్రభుత్వ పాఠశాల, ఉరవకొండ
కె.మహమ్మద్‌ఆఫ్రిద్	584	ఏపీ మోడల్ స్కూల్, ఉరవకొండ
పెనకచెర్ల భార్గవి	584	కేజీబీవీ, ఆత్మకూరు
వడ్డే మహేష్	584	జెడ్పీహెచ్ఎస్ లక్ష్మంపల్లి, శెట్టూరు
పుట్లూరు గణేష్‌రెడ్డి	584	జెడ్పీహెచ్ఎస్ హనకనహాల్, కణేకల్లు
సాకే సంతోష్	583	ఏపీ ట్రైబల్ స్కూల్, గొల్లలదొడ్డి
ఆర్.పూజిత	583	జెడ్పీహెచ్ఎస్ 8వ వార్డు, గుత్తి
బి.సూర్యప్రతాప్‌రెడ్డి	583	ఏపీ మోడల్ స్కూల్, పామిడి
నల్లగారి హరిప్రియ	583	ఏపీ మోడల్ స్కూల్, యల్లనూరు
జంపక్కగారి వీణ	583	కేసీ ప్రభుత్వ పాఠశాల, కళ్యాణదుర్గం
సిద్ధనాథం శివలక్ష్మి	583	ఏపీ మోడల్ స్కూల్, తాడిపత్రి
గొని దివ్యశ్రీ	583	ఎంజేపీ స్కూల్, డి.హీరేహాల్
జి.గాయత్రి వైష్ణవి	582	ఏపీ మోడల్ స్కూల్ ఉరవకొండ
ఎం.మధుసూదన్	582	ఏపీ మోడల్ స్కూల్, పామిడి

'ఏపీఎఫ్ఆర్' నమోదు తప్పనిసరి

• ప్రతి రైతు పేర్లూ నమోదు చేయండి
• జేడీఏ ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

గుత్తి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ తన పేరును ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ (ఏపీఎఫ్ఆర్) పోర్టల్‌లో నమోదు చేయాలని వ్యవసాయాధికారులను ఆ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గుత్తిలోని జీవనోపాధుల వనరుల కేంద్రం (సీఎల్ఆర్సీ)లో బుధవారం 2025 ఖరీఫ్ సాగుకు సమాయత్తంపై గుత్తి డివిజన్‌లోని పామిడి, యాడికి, పెద్దవడుగూరు, గుత్తి, శింగనమల మండలాల వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ, ఎంపీఈఓలతో ఆమె సమావేశమై మాట్లాడారు. రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల అందజేతపై అవగాహన పెంచాలన్నారు. ఖరీఫ్ 2025 సీజన్‌లో కౌలు రైతులకు కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో లభించే ఎరువుల లభ్యతపై రైతులను చైతన్య పరిచి, సకాలంలో వాటిని అందించాలన్నారు. కరువు మండలాలుగా ప్రభుత్వం గుర్తించిన యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో వ్యవసాయ శాఖ పరంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, జేడీఏ కార్యాలయ సాంకేతిక వ్యవసాయాధికారులు వెంకటకుమార్, బాలానాయక్, వ్యవసాయాధికారులు ముస్తాక్ అహమ్మద్, లీనా వసుంధర పాల్గొన్నారు.

ఈత సరదా ప్రాణాలు బలిగొంది



అంజనకుమార్ (ఫైల్)

కొడవలూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని నార్తురాజుపాళెం శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో చదువుతున్న అనంతపురం జిల్లా విద్యార్థి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం గొళ్ల గ్రామానికి చెందిన కురుబన్ అంజన్‌కుమార్ (20) శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల హాస్టల్లోనే ఉండేవాడు. బుధవారం 3డే ఫెస్ట్ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అంజన్‌కుమార్ అనంతరం తన నలుగురు స్నేహితులతో కలసి రేగడిచెలికలోని బావి వద్దకు ఈత కొట్టేందుకని వెళ్లాడు. అంజన్, మరో ఇద్దరు బావిలో ఈతకు దిగారు. ఇద్దరు మాత్రం ఈత రాదంటూ బయటే ఉండిపోయారు. కాసేపటికి ఇద్దరు విద్యార్థులు బయటకు రాగా అంజన్ పైకి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన వారు కళాశాల యాజమాన్యం ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని ఈత తెలిసిన వారితో బావిలో వెతికించారు. సుమారు 40 అడుగుల వరకూ నీళ్లు, అడుగున బురద ఉండటంతో అందులో కూరుకుపోయిన అంజన్‌ను వెలికి తీసేందుకు వీలు కాలేదు. ఎస్ఐ పి.నరేష్, కళాశాల యాజమాన్యం గజ ఈతగాళ్లను పిలిపించారు. వారు మృతదేహం కాలికి తాడు కట్టి వెలికి తీశారు. తల్లిదండ్రులకు ఇద్దరు ఆడ పిల్లల తర్వాత అంజన్ మూడో సంతానమని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



వై. అశ్రియభాను (వైట్ జెర్సీ)

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సీనియర్ నేషనల్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. అసోంలోని గౌహతిలో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఇందులో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న డి.శ్రీకాంత్ (పురుషుల జట్టు), వై.అశ్రియభాను (మహిళల జట్టు)కు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా వారిని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ కె.శివానంద అభినందించారు.

ప్రమాదంలో ఫైర్‌మెన్ మృతి



సుధాకర్ (ఫైల్)

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఫైర్‌మెన్ సుధాకర్ (40) దుర్మరణం పాలయ్యారు. అనంతపురంలో నివాసముంటున్న ఆయన పుట్టపర్తిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం విధులు ముగించుకున్న ఆయన అనంతపురానికి వెళ్లే క్రమంలో మామిళ్లపల్లికి చేరుకున్నారు. అనంతరం బస్సు కోసం జాతీయ రహదారిని దాటుతుండగా బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వేగంగా వెళుతున్న లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య రమ్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

డీఎస్సీలో జిల్లాకు అన్యాయం



సూపరింటెండెంట్ వసంతలతకు వినతిపత్రం అందజేస్తున్న యువజన సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాకు కేవలం 202 ఎస్‌జీటీ పోస్టులు కేటాయించి ప్రభుత్వం అన్యాయం చేసిందని యువజన సంఘాల నాయకులు మండిపడ్డారు. పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ శాంతిభద్రతల విభాగం సూపరింటెండెంట్ వసంతలతకు నాయకులు వినతిపత్రం అందజేశారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం 70 రోజుల వ్యవధిని ప్రభుత్వం కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, విద్యార్థి నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు టీపీ రామన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోట్రేష్ తదితరులున్నారు.

డీఎస్సీకి అవకాశం కల్పించాలి

డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని బీపీఈడీ చివరి సంవత్సరం విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం సూపరింటెండెంట్ వసంతలతను విద్యార్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. బీపీఈడీ, ఇతర సమానమైన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాల చివరి సంవత్సరం విద్యార్థులకు గతంలో అర్హత ఉండేదని, అదే తరహాలో ఇప్పుడూ తాత్కాలికంగా దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలన సమయంలో కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో దివ్యాప్రసన్నకుమారి, శ్రీనివాస్, ఉమామహేష్, సాయికుమార్, దేవానందరెడ్డి, మహేష్, తదితరులు ఉన్నారు.

యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

రాప్తాడు: యువత 90 రోజుల శిక్షణలో మెలకువలు నేర్చుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల యోజన–సీడాప్ స్కిల్ కళాశాల ద్వారా డీఆర్‌డీఏ–టీటీడీసీలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్–వాయిస్‌లో శిక్షణ పొందుతున్న యువతకు బుధవారం పీడీ యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేడీఎం సూర్యనారాయణ, సీడాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంచి సుభాన్‌కు డాక్టరేట్



అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గణిత అధ్యాపకుడు డాక్టర్ గద్దల ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో పరిశోధన చేసిన గణిత శాస్త్ర పరిశోధక విద్యార్థి కంచి సుభాన్‌కు ఎస్కే యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. 'అయస్కాంత హైడ్రో డైనమిక్ యొక్క వేడి మరియు ద్రవ్యరాశి బదిలీ, లక్షణాలు– వివిధ ప్రవాహ డైనమిక్స్‌తో న్యూటోనియన్ కాని ద్రవ ప్రవాహం' అనే అంశంపై ఈయన పరిశోధన చేశారు. సుభాన్ ప్రస్తుతం నంద్యాల జిల్లా బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈయన రాసిన పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు కంచి సుభాన్‌కు అభినందనలు తెలిపారు.

అనంతలక్ష్మిలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న పాఠశాల చైర్మన్ అనంతరాముడు

అనంతపురం: అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుక అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ అనంత రాముడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో ఉన్నత విద్యా వంతులుగా ఎదిగి.. వివిధ రంగాల్లో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల సీఏఓ నరసింహా రావు, హెచ్‌ఎం షాలిని తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆ పాత మధురాలు

అనంతపురం కల్చరల్: అలనాటి మధుర గీతాలతో జిల్లా గాయనీ గాయకులు అనంత వాసులను ఉర్రూతలూగించారు. 'ఆనాటి ఆనంద హృదయాల ఆనంద గీతాల' పేరుతో బుధవారం సాయంత్రం స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో సినీ స్వర చక్రవర్తికి, గానకోకిల ఎస్.జానకి జన్మదినం సందర్భంగా గురువుల గళ నివాళి అర్పించారు. పాటలతో బాలమురళీకృష్ణ, రామాంజి, చంద్రమౌళి, శ్రీదేవి, విజయలక్ష్మి, ఖలందర్ తదితరులు ఆకట్టుకున్నారు. తొలుత చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఉగ్రవాదులను తరిమికొట్టాలి

అనంతపురం కల్చరల్: జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో నరమేధం సృష్టించిన ఇస్లామిక్ ముష్కరులను కఠినంగా శిక్షించాలని హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం వివిధ హిందుత్వ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డితో పాటు విశ్వహిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు రత్నమయ్య, బీజేపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఎదుగుతున్న భారత ప్రజాస్వామ్యాన్ని సహించలేని దుండగులు అమాయకులను పొట్టనపెట్టుకోవడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అన్ని రంగాలలో దేశం ముందుకు పోతుంటే అసూయ ద్వేషాలను ఉగ్రరూపంలో వెళ్లగక్కడం దారుణమన్నారు. కార్యక్రమంలో హిందుత్వ సంస్థల ప్రతినిధులు శ్రీనివాసులు, విశ్వనాథరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: జమ్ముకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అమానుషమని సీపీఎం నాయకులు అన్నారు. ఉగ్రదాడిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.



ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

బుధవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కశ్మీర్ అంతా బాగుంది, శాంతిభద్రతలు పునరుద్ధరించామని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేస్తున్న ప్రచారం ఈ దాడితో బూటకమని తేలిందన్నారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ముత్తూజ, ప్రకాష్, వలి, గోపాల్, ఇర్ఫాన్, మసూద్, జీవ, రాజు, లక్ష్మినారాయణ, బాలకృష్ణ, వెంకట, నూరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

అనంతపురం: పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదురుగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి కేంద్రం ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.



టవర్‌క్లాక్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కార్యక్రమంలో సురేష్, వీర, ఎర్రిస్వామి, భరత్, రంగస్వామి, నాగేంద్ర, హరి, అనిల్ , ముని తదితరులు పాల్గొన్నారు.

• ఉగ్ర దాడిని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్ర యాదవ్ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. అనాగరికమైన ఉగ్రవాద దాడిని 'ఐలు' తీవ్రంగా ఖండిస్తోందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిరాయుధులైన పౌరులపై జరిగిన ఈ దారుణమైన హింసాత్మక చర్య క్షమించరానిదని పేర్కొన్నారు.

'న్యాయం చేయండి'



మీడియాతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

అనంతపురం రూరల్: చిన్న కుమారుడు తమను మోసం చేసి ఆస్తితో పాటు రెండు ఇళ్లను తనఖా పెట్టడమే కాకుండా ఇంటి నుంచి బయటికి గెంటేశాడని, తమకు న్యాయం చేయాలని కాట్నేకాలువ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం రుద్రంపేటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాట్నేకాలువ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, చెన్నమ్మ దంపతులు మాట్లాడుతూ తాము కాట్నేకాలువలో వ్యవసాయం చేసుకుంటూ దాదాపు 100 ఎకరాల భూమిని సంపాదించామన్నారు. తమకున్న భూమిని ముగ్గురు కుమారులకు సమానంగా వాటాలు పంచి కొంత భూమితో పాటు రెండు ఇళ్లను తమ వద్ద ఉంచుకున్నామన్నారు. అయితే చిన్న కుమారుడు తమకు తెలియకుండా ఇళ్లను, భూమిని తనఖా పెట్టి సంతకాలు చేయించుకున్నాడన్నారు. ఈ విషయం రెండు సంవత్సరాల తర్వాత బయటపడటంతో తమను ఇంటి నుంచి గెంటి వేయడమే కాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.

తగ్గిన పది ఉత్తీర్ణత శాతం

ఆత్మకూరు: ఎన్నడూ లేని విధంగా ఆత్మకూరు మండలంలో టెన్త్ ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది బాగా తగ్గిపోయింది. మండల వ్యాప్తంగా 53.9 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు తెలియజేశారు.హోలిస్పిరిట్ పాఠశాల విద్యార్థి అంకిత 587, కేజీబీవీ విద్యార్థిని భార్గవి 584, హోలిస్పిరిట్ పాఠశాల విద్యార్థి బాల నాగేశ్వరరెడ్డి 579 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారు. ఇక ఆత్మకూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ముల్లా సమీహ 565 మార్కులతో మెరిసింది.

రాప్తాడు: టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మండల వ్యాప్తంగా ఆరు ఉన్నత పాఠశాలు,కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్లో కలిపి 346 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 216 మంది పాసయ్యారు. ఇక ప్రైవేట్ పాఠశాలల నుంచి 279 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారిలో 252 మంది పాసయ్యారు.



584 మార్కులు సాధించిన భార్గవిని అభినందిస్తున్న కేజీబీవీ ఎస్ఓ లీమారోజ్

టెన్త్ ఫలితాల్లో 'ప్రైవేటు' సత్తా

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో నగరంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక సంగమేష్‌నగర్, గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి పాఠశాలల విద్యార్థులు ఎస్.గానశ్రీ 585, సీబీ తన్వీష్‌చరణ్, డి.హృదయ్ వికాస్ తేజ 582, డి.నీలాచలం 580 మార్కులు సాధించారు. 550, ఆపైన మార్కులు 34 మంది, 500, ఆపైన మార్కులు 81 మంది సాధించారు. వీరిని కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు కె.పద్మావతి, ఎ. రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

• అనంతపురం జోన్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. 596 మార్కులు నలుగురు, మరో నలుగురు విద్యార్థులు 595 మార్కులు, 590, ఆపైన మార్కులు 56 మంది విద్యార్థులు సాధించారు. అభినందన సభలో ఆ సంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్స్ విశ్వనాథ్, సమీనా ఖాన్, తబస్సుమ్, వెంకటేష్, నరేష్, పర్వీన్ భాను, నేత్రావతి, శాంత, శ్రీదేవి, రాధిక, కరీం, కోఆర్డినేటర్లు రాధాకష్ణ, తిరుమలేష్, నాగభూషణం , ఇర్షాద్, టీచర్లు విద్యార్థులను అభినందించారు.

• గుత్తిరోడ్డులోని లక్ష్మి సినర్జీ స్కూల్ విద్యార్థులు టి.జ్యోత్స్నశ్రీ 594, సి.గీతిక 594, ఆర్.రుత్విక్ పవన్ రెడ్డి 594 మార్కులు సాధించారు.కె.హఫ్షనా పిర్దోష్ 593, బి.మహమ్మద్ రెహన్ 593, బి.లలిత్ కుమార్‌రెడ్డి 593 మార్కులు సాధించారు. ఎస్.దివిజేస్‌రెడ్డి 592 మార్కులు సాధించారు. 590, ఆపైన ఏడుగురు, 580, ఆపైన 39 మంది, 570, ఆపైన 67 మంది, 560, ఆపైన 97 మంది, 550, ఆపైన మార్కులు 117 మంది విద్యార్థులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ ఎం.మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

• స్థానిక అశోక్‌నగర్ మినర్వా పాఠశాల విద్యార్థులు బి.రెనీలాప్రియ 596, సి.పరిణిత 579, షేక్ మహమ్మద్‌గౌస్ 577, తేజస్విని 571, సి.హుసేన్ 571 మార్కులు సాధించారు. 500కు పైగా మార్కులు 17 మంది సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ జి.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

• వికాస్‌నగర్‌లోని శ్రీరామకృష్ణ విద్యాలయం (ఎస్ఆర్‌కే స్కూల్) విద్యార్థులు ఎస్.రజిని 581, వి.మోహన్ 579, ఎ.ప్రియాంకరెడ్డి 572 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

• స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని నవభారత్ స్కూల్ విద్యార్థులు ఎం. నందకిషోర్ 582, జి.అరవింద్ యాదవ్ 576, కె.సాత్విక 576 సాధించారు. 500, ఆపైన మార్కులు 35 మంది సాధించారు. వీరిని కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, హెచ్ఎం ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

• స్థానిక ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు 550 మార్కులకు పైన 9 మంది, 500 పైన 39 మంది విద్యార్థులు సాధించారు. వీరిని అనంతపురం జోనల్ ఇన్‌చార్జ్ ఎం.శివకుమార్,ఏజీఎం వెంకట్, ప్రిన్సిపల్ రాజేష్, వైస్ ప్రిన్సిపల్ రవిచంద్ర, డీన్ రాధాకృష్ణ, ఏజీఎం వెంకటేశ్వర్లు, సి.జగన్‌మోహన్ రెడ్డి, కల్పన, వైస్ ప్రిన్సిపల్ రాజేష్, టీచర్లు అభినందించారు.

• 3వ రోడ్డులోని సాయి విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కె.రోహిత్ 575, యు.వరుణ్ సందీప్ 574, ఎస్.మహమ్మద్ ఆరిజ్ 571 మార్కులు సాధించారు. వీరిని డైరెక్టర్లు ఎంపీ శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రిన్సిపల్ జి.లావణ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో మాంటిస్సోరి పాఠశాలల యాజమాన్యం



సి.గీతిక



ఆర్.రుత్విక్ పవన్ కుమార్‌రెడ్డి



విక్టరీ సంకేతం చూపుతున్న సాయి విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం



మినర్వా స్కూల్ కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డితో విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న నవభారత్ స్కూల్ యాజమాన్యం



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ యాజమాన్యం

నేడు దేవపుత్ర జయంతి

• సాహిత్యానికి వన్నె తెచ్చిన 'చిలుకూరు'



చిలుకూరు దేవపుత్ర

అనంతపురం కల్చరల్: జిల్లా సాహిత్యానికి ఎనలేని సేవలందించి కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టిన చిలుకూరి దేవపుత్ర జయంతిని గురువారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే నివాళి కార్యక్రమానికి సాహిత్యాభిమానులు విచ్చేయాలని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

వినూత్నంగా.. ఆలోచనాత్మకంగా

జిల్లా సాహిత్యాన్ని నూతన ఒరవడిలో నడిపించిన కథా, నవలా రచయితగా ప్రసిద్ధుడైన చిలుకూరు దేవపుత్ర కథలు వినూత్నంగా, ఆలోచనాత్మకంగా ఉంటాయి. ఆయన అక్షరానికి సొబగులు దిద్దిన తీరు నేటికీ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. దళితుల జీవనచిత్రాలతో పాటు కరువు,ఫ్యాక్షనిజం , అణగారిన వర్గాల బతుకులను కథలుగా మలచి, సీమ జీవితాన్ని ప్రపంచ పాఠకులకు తెలియజేసిన అభ్యుదయ కథకుడిగా పేరుగాంచారు.

జాతీయ స్థాయిలో పేరు...

చిలుకూరు దేవపుత్ర 1952 ఏప్రిల్ 24న బెళుగుప్ప మండలంలోని కాలవపల్లిలో సోజనమ్మ, ఆశీర్వాదం దంపతులకు జన్మించారు. నిరుపేద కుటుంబంలో జన్మించినా తన 12వ ఏటనే రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు. తొలుత జైళ్ల శాఖలో పనిచేసిన ఆయన అనంతరం రెవెన్యూ శాఖలో పలు పదవుల్లో పనిచేసి డిప్యూటీ తహసీల్దార్‌గా పదవీ విరమణ పొందారు. ఆయన భార్య లక్ష్మీదేవి, కుమార్తె దీవెన, కొడుకు అన్వేష్ కూడా మంచి కథకులు కావడం విశేషం. అనేక అవార్డులు, రివార్డులు అందుకున్న ఆయన 2016 అక్టోబరు 18న శాశ్వతంగా సాహితీలోకం నుంచి కనుమరుగైపోయారు. ఆయన రచనల్లో 'ఆరు గ్లాసులు' వంటి వందలాది కథలు, 'క్షతశిల', 'పంచమం' వంటి నవలలు అనంత అక్షర స్థానాన్ని జాతీయస్థాయిలో ఇనుమడింపజేశాయి.

వడ్డీతోనే రుణాలు రెన్యువల్ చేయాలి

• ఎల్‌డీఎంకు రైతు సంఘం వినతి పత్రం

అనంతపురం అగ్రికల్చర్: కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సంబంధించి బ్యాంకుల్లో బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలతో పాటు పంట రుణాలకు కేవలం వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తరిమెల నాగరాజు, చెన్నారెడ్డి, భాస్కర్ తదితరులు బుధవారం ఎల్‌డీఎం నర్సింగ్‌రావును కలిసి వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్‌సబ్సిడీ, ఇన్సూరెన్స్, పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉన్నందున బంగారు రుణాలు, పంట రుణాలు పూర్తిగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాలంటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. దీని వల్ల రైతులు మరింత కష్టాల్లో పడతారని తెలిపారు. బ్యాంకులు మానవత్వంతో వ్యవహరించి కేవలం వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలని కోరారు. ఖరీఫ్ పంట రుణాలు మొదలైనందున రైతులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతుకూ కిసాన్ క్రెడిట్ కార్డు అందించడం, పంట రుణాలు మార్టిగేజ్ లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని కోరారు.



ఎల్‌డీఎం నర్సింగ్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

రాప్తాడు: చౌక దుకాణాదారులు నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ విజయకుమారి హెచ్చరించారు. బుధవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు డీలర్లు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే డీలర్‌షిప్ రద్దు అవుతుందని హెచ్చరించారు. చౌక డిపోల్లో తూకాల్లో మోసం చేస్తే ఎంతటి వారినైనా క్షమించే ప్రసక్తే ఉండదన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ జ్యోతి, డీలర్లు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఫణీంద్ర

అనంతపురం టవర్‌క్లాక్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఫణీంద్ర నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మరెడ్డి బ్రహ్మానంద రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఫణీంద్రకు సూచించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రాప్తాడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల పరిరక్షణ సంస్థ సోషల్ వర్కర్ వెంకట్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాప్తాడులోని బాలజీ గ్రామైక్య సంఘంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే చైల్డ్‌లైన్ 1098 లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీసీ ఉమాదేవి, వీఏఏ సుధామణి, వీఓఎల్ షహనాజ్, గ్రామ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి

ఆత్మకూరు: నాటుసారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎక్సైజ్ ఎస్ఐ జాకీర్ హుస్సేన్ తెలిపారు. నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గొరిదిండ్ల, ముట్టాల, వేపచెర్ల తండా గ్రామాల్లో నాటుసారా నిర్మూలనపై నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. వేపచెర్ల ఎగువ తండాలో ఐదుగురు పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలియజేశారు.

పుస్తక పఠనంతో మంచి నడవడిక

అనంతపురం కల్చరల్: పుస్తక పఠనం వల్ల మంచి ఆలోచనలు, జీవితాన్ని నిలబెట్టే నడవడిక అలవడుతుందని పలువురు వక్తలన్నారు. బుధవారం స్థానిక స్ఫూర్తి బుక్‌హౌస్‌లో అంతర్జాతీయ పుస్తక దినోత్సవం సందేశాత్మకంగా సాగింది. నిర్వాహకులు కామాని రవిశేఖరరెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు రచయితలు, కవులు, పుస్తక ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ పుస్తకాలకు ఎనలేని ఆదరణ ఉందన్నారు. కవి రియాజుద్దీన్ ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. కరుణాకరరెడ్డి, ఆశ్రయ కృష్ణారెడ్డి, చెన్నకేశవులు, శేషసాయిరాజు, శ్రీనివాసులు, శ్రీకాంతరెడ్డి, గంగాధర్, తోటనాగరాజు, నల్లపరెడ్డి, భోగేశ్వరరెడ్డి తదితరులు పుస్తక పఠనం ప్రాముఖ్యత గురించి మాట్లాడారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ పుస్తక దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక పీటీసీ మైదానం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ముఖ్య అతిథిగా డాక్టర్ శంకరగౌడ్, జేవీవీ రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్ తదితరులు మాట్లాడారు. ఈనెల 30 వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు.